ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు

- ఏపుగా పెరుగుతున్నా తొలగించడంలో ట్రాన్స్‌కో సిబ్బంది అలసత్వం
- అధ్వానంగా మారుతున్న పరిసరాలు



గంగాస్థాన్‌లోకి వెళ్లే రహదారి పక్కన పిచ్చి మొక్కల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గంగాస్థాన్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు పిచ్చిమొక్కల మధ్య ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు ప్రమాదాలు జరగకుండా సిమెంట్ ఫిల్లర్ ఏర్పాటు చేసి, చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. కానీ కంచె లోపల పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అయినా వాటిని తొలగించడంలో సంబంధిత అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో నెలల తరబడిగా పర్యవేక్షణ చేయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిసరాలుగా అధ్వానంగా మారుతున్నాయి..

వైర్లకు చుట్టుకుంటున్న తీగలు..

గంగాస్థాన్ ఫేస్–1 కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతంలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు పెద్దగా మారుతున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ట్రాన్స్‌ఫార్మర్ నుంచే విద్యుత్ సిబ్బంది పనులు చేయాల్సి ఉంటుంది. కానీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిసరాలు అధ్వానంగా ఉండటం, ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఉండడంతో అందులో ఏముందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే పిచ్చి మొక్కలు కొన్ని చోట్ల పెద్దగా ఉండడంతో వైర్ల వరకు తీగలు చుట్టుకుంటున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ల ప్రాంతంలో ఇలా పిచ్చిమొక్కలు ఉంటే సిబ్బంది మరమ్మతులను భయపడుతూ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి నెలా విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా అధికారులు కరెంట్ కోతలు విధిస్తున్నారు. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు ఉంటే తొలగిస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో పెరిగిన పిచ్చి మొక్కలు మాత్రం తొలగించడం లేదు. చిన్నపాటి అలసత్వం వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. పశువులు పిచ్చి మొక్కలు, గడ్డిని తింటూ.. అనుకోకుండా కరెంట్ షాక్ తగిలి మరణించే అవకాశం ఉంది. అలాగే పిచ్చి మొక్కలు విద్యుత్‌వైర్లను అల్లుకుపోతే తరచుగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి, ప్రమాదాలు జరుగకముందే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



గంగాస్థాన్ కాలనీలో..



నగరంలో డీ-5 సెక్షన్ కార్యాలయం సమీపంలో..

అటెన్షన్ ప్లీజ్..



మండల కేంద్రం నుంచి చిన్నవాల్గోట్ గ్రామానికి వెళ్లే మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. కల్వర్టు పైపులు జాయింట్ వద్ద విడిపోయి రోడ్డు మధ్యలో గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– సిరికొండ

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: హైమద్ హుస్సేన్, పంచాయతీరాజ్, ఏఈ

ఫోన్ నంబర్ : 98668 27303

క్లుప్తంగా

20న తహసీల్దార్ ఆఫీస్ ముట్టడి



సిరికొండ: ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముట్టడించనున్నట్లు పీవోడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ పిట్ల రమ తెలిపారు. మండలంలోని రావుట్ల, తూంపల్లి గ్రామాల్లో మంగళవారం ఆమె ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాయకులు బాబన్న, రమేష్, సాయారెడ్డి, పుష్పలత, మానస, రమేష్, అనీస్ పాల్గొన్నారు.

పరిశోధన రంగాన్ని మరింత ప్రోత్సహించాలి



నిజామాబాద్‌నాగారం: దేశంలో పరిశోధన రంగాన్ని ప్రోత్సహించాలని, యువ శాస్త్రవేత్తలు తయారయ్యే విధంగా కృషి చేయాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ పేర్కొన్నారు. వినాయక్‌నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పరిశోధన రంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఇప్పటికే శాస్త్రవేత్తల కొరతతో దేశంలో చాలా విపత్కరమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, మురళీధర్, రవీందర్‌లు పాల్గొన్నారు.

అగ్నిమాపక శాఖ విన్యాసాలు



ఖలీల్‌వాడి: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అగ్నిమాపకశాఖ సిబ్బంది విన్యాసాలు నిర్వహించారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల సందర్భంగా నగరంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు వాటిల్లినప్పుడు ప్రజలు భయాందోళనకు గురికావద్దన్నారు. ఫైర్ డ్రిల్, ఫస్ట్‌ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ గురించి క్లుప్తంగా వివరించారు. అగ్నిమాపక కేంద్రధికారి నర్సింగ్‌రావు, సిబ్బంది యేసురత్నం, ఆశిష్ కుమార్, హనుమాన్‌చారి, నజీమ్ ఉన్నారు.

రెమ్యునరేషన్ విడుదల చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 3నుంచి 11వరకు నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ రెమ్యునరేషన్ ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిలు కృపాల్ సింగ్, రవీందర్ డిమాండ్ చేశారు. కొంత మందికి మాత్రమే రెమ్యూనరేషన్ ఇవ్వడం సరికాదన్నారు. అలాగే స్పాట్ వాల్యుయేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచాలన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



సుభాష్‌నగర్: ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన టీఎన్‌జీవో జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ హైదరాబాద్‌లో సన్మానించారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులకు ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ పరిచయం చేశారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను జిల్లా కార్యవర్గం సన్మానించింది. జిల్లా కార్యదర్శి శేఖర్, మాజీ కార్యదర్శి సంగం అమృత్‌కుమార్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జికి..



సుభాష్‌నగర్: మాజీ ఎంపీ, బీజేపీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బూర నర్సయ్యగౌడ్‌కు మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా సన్మానించారు. జిల్లా కేంద్రానికి విచ్చేసిన మాజీ ఎంపీని ధన్‌పాల్ తన నివాసానికి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నర్సయ్యగౌడ్‌కు స్వాగతం పలికారు. ధన్‌పాల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలపై ఆరా తీసి అభినందించారు. కుటుంబ సభ్యులు వినయ్ కుమార్, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి



ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను సత్కరిస్తున్న ఘన్‌పూర్ బీఆర్‌ఎస్ నాయకులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించేలా కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కు ఘన్‌పూర్ గ్రామస్తులు విన్నవించారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు శక్కరికొండ కృష్ణ, సతీష్‌రెడ్డి, రామకృష్ణ, గంగాధర్, సమీర్‌పాషా, ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లి, ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల తాను రైల్వే జీఎంను కలిసి లెటర్ ఇచ్చినట్లు తెలిపారు. జీఎం స్పందించి త్వరలో నిజామాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఆగి పరిశీలిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

సబ్‌స్టేషన్ మంజూరు చేయాలి..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఎంపీటీసీ చింతల దాసు, వీడీసీ సభ్యులు కోరారు. ఈమేరకు మంగళవారం వారు హైదరాబాద్‌కు వెళ్లి, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ప్రవీణ్ కుమార్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

12రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి

డిచ్‌పల్లి: రేషన్ షాపుల్లో ప్రజలకు అవసరమైన 12 రకాల నిత్యావసర సరుకులు, ప్రతి మనిషికి 10 కేజీల బియ్యం, 50శాతం సబ్సిడీపై వంటగ్యాస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులైన వంటనూనె, గోధుమపిండి, కందిపప్పు, పెసర పప్పు, పసుపు, పంచదార, కారం, ఉప్పు, చింతపండు, టీ పొడి, సబ్బులు మొదలైన సరుకులను పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందించాలని కోరారు. సుజాత, అనిత, సుల్తానా, శారద, మురళి, సాయాగౌడ్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం





గన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు.. మైలారం గ్రామంలో..

సిరికొండ: మండలంలోని మైలారం, చీమన్‌పల్లి, పీసరగుట్ట తండా, పోత్నూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. మైలారంలో సర్పంచ్ రమ్య, ఎంపీటీసీ సతీష్, ఉపసర్పంచ్ సత్యానంద్, సీసీ శేఖర్, చీమన్‌పల్లిలో సర్పంచ్ పద్మశివారెడ్డి, కొండూర్ తాండలో సర్పంచ్ నర్సారెడ్డి, పోత్నూర్‌లో సర్పంచ్ మంజుల, సీసీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి సహకార సంఘం పరిధిలోని గన్నారం, ఇందల్వాయి, చంద్రాయన్‌పల్లి తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఆనంద్, ఎంపీపీ రమేష్ నాయక్ ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దాసు, ఎంపీటీసీ సుధాకర్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

నిజామాబాద్‌నాగారం: నగరంలోని జీజీ కళాశాల ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మేయర్ దండు నీతూకిరణ్ ప్రారంభించారు. పీడీ రాములు, ప్రాజెక్టు అధికారి రమేష్, పీఆర్‌పీ శోభరాణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం నిజామాబాద్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. సొసైటీ సీఈవో వంశీ, డైరెక్టర్లు నరేందర్, ప్రదీప్, రైతులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మె నోటీసు అందజేత



ధర్పల్లి ఎంపీడీవో నటరాజ్‌కు సమ్మె నోటీసు అందచేస్తున్న వీవోఏలు

ధర్పల్లి: మండలంలోని ఐకేపీలో పని చేస్తున్న వీవోఏ లు సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 24 నుంచి సమ్మె చేపడుతామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ధర్పల్లి ఎంపీడీవో నటరాజ్, ఏపీఎం సునీతకు వారు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ప్రభుత్వం తమతో అన్ని రకాల పనులు చేయించుకుంటున్నదని తెలిపారు. అయినప్పటికీ తమకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా వారితో సమానంగా వేతనం, బీమా సౌకర్యం, 27 రకాల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. వీఓఏల మండలాధ్యక్షుడు నయీం, కార్యదర్శి రాజేశ్వర్, నిర్మల, అలేఖ్య ల్గొన్నారు.

సిరికొండ: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఏపీఎం సత్యానంద్, ఇతర అధికారులకు వీవోఏలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మూన్‌సింగ్, లలిత, కవిత, వినోద్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

ఖలీల్‌వాడి: కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పేర్కొన్నారు. నగరంలోని కోటగల్లి శ్రామిక భవన్‌లో మంగళవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యం మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ నిలివేత కోసం పోరాడుదామన్నారు. ముత్తన్న, సుధాకర్, రాజేశ్వర్, వెంకన్న, మల్లేష్, రవిపాల్గొన్నారు.

జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

ఖలీల్‌వాడి: సూర్యాపేటలో ఈ నెల 24, 25 తేదీల లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌ఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడం మూలంగ వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడుతుందన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో రైతాంగా ఉద్యమాలను సమీక్షించుకొని రాబోయే రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేయడానికి కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఎటువంటి పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. నగరంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారీతిన అడ్మిషన్లు చేపట్టినా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి



ఖలీల్‌వాడి: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ సెంటర్లకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని, దీంతో సెంటర్లకు సెలవులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షురాలు దేవగంగు అధ్యక్షతన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. హెల్పర్లకు పదోన్నతి కల్పించే విషయంలో పదో తరగతి అర్హతతో టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ పీడీ సంధ్యారాణికి అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పెద్దింటి స్వర్ణ, కోశాధికారి చంద్రకళ, ప్రాజెక్టు నాయకులు మంగ, శివ రాజవ్వ, సూర్యకళ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



నిజామాబాద్ సిటీ: నగరంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు వేలేటి పశుపతిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మహేందర్, ఈవో శ్రీరాం రవీందర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహా చండీయాగం



నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్‌సిటీ: నగరంలో శ్రీకృష్ణ కాలచక్ర ఆయుత మహా చండీయాగం ఘనంగా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం అతిరుద్రం సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు, అఖిలభారత యాదవ మహాసభ అధ్యక్షుడు లడ్డు యాదవ్, సీరియల్ నటుడు వెంకట యాదవ్, వ్యాపారవేత్త రామచంద్ర పాల్గొన్నారు. జిల్లా యాదవ సంఘం మహిళ అధ్యక్షురాలు మంజుల యాదవ్ వారిని కలిసి సన్మానించారు.



బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,750	వెండి (కిలో)	74,000
22 క్యారెట్స్	56,008	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	40	60
బెండకాయ	30	50	గాజరుగడ్డ	15	30
జీరకాయ	40	60	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
జిల్లేసుకాయ	60	80	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	40
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	20	40			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్-1- రుద్రుడు -(తెలుగు)-10.20
దసరా (తెలుగు)- 1.25,7.35
విడుదల-పార్ట్ 1 (తెలుగు)-4.30,10.35
స్క్రీన్-2- విడుదల-పార్ట్ 1-10.30
బలగం-1.35; రావణాసుర-4.15
రుద్రుడు-7.25; దసరా-10.25
స్క్రీన్-3- రావణాసుర- 10.40
శాకుంతలం - 1.40, 7.20, 10.15
బలగం-4.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1- విడుదల-పార్ట్ 1 -1.05, 4.10
శాకుంతలం-3డీ- 7.15, 10.20
స్క్రీన్-2 - రుద్రుడు-12.35, 7.00
దసరా -3.45, 10.10
స్క్రీన్-3- విడుదల-పార్ట్ 1 - 12.15
3.20, 6.25, 9.30
స్క్రీన్-4- రావణాసుర -12.30, 3.35, 6.40,9.45

దేవి – రావణాసుర
నటరాజ్ – రుద్రుడు
లలితామహల్ – దసరా
విజయ్ – శాకుంతలం

సంక్షిప్తం

ఆర్థికసాయం అందజేత



సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు తోట రఘు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మంగళవారం ఎంపీ అర్వింద్ తన సహాయ నిధి నుంచి రూ.1లక్ష సాయం అందజేశారు. మండలాధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఇందల్వాయి: నల్లవెల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త పూదరి గంగశ్రీను కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మంగళవారం పార్టీ తరపున రూ.1లక్ష సహాయాన్ని అందజేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు కన్నె చిన్ను, దినేష్, రాజన్న ఉన్నారు.

రంజాన్ దుస్తుల పంపిణీ

సిరికొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ముస్లింలకు రంజాన్ దుస్తులను జెడ్పీటీసీ మాన్‌సింగ్ పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రాజన్న, తహసీల్దార్ గఫార్‌మియా, డీటీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండారంలో ఇఫ్తార్‌విందు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామంలో మంగళవారం రాత్రి జెడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. సర్పంచ్ లక్ష్మన్‌రావు, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, గ్రామశాఖ అధ్యక్షుడు ఉమాపతి, కేసీఆర్ సేవాదళం రూరల్ అధ్యక్షుడు కోర్వ దేవేందర్, సొసైటీ చైర్మన్ శ్రీధర్, ప్రేమ్ నాయక్, జమీర్ ఖాన్, అబ్దుల్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఖలీల్‌వాడి: జిల్లాకేంద్రంలోని ఖిల్లా రోడ్డు హస్మి మసీద్‌లో బుధవారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు హాజరుకానున్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 20వ డివిజన్లో మంగళవారం కంటి వెలుగు శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా కార్పొరేటర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు శిబిరంను పరిశీలించారు. బీజేపీ నాయకులు సురేష్, ప్రసాద్, కిషన్, మైపాల్, నారా గౌడ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: నగరంలోని పాంగ్రా బ్యాంక్‌కాలనీలో మంగళవారం కంటి వెలుగు శిబిరం ప్రారంభమైంది. డివిజన్ నాయకులు శ్రీకాంత్, నర్సింహచారి, సాయన్న, శిల్పా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

నవీపేట: మండల కేంద్రంలో పిచ్చి కుక్కలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. మంగళవారం పిచ్చికుక్కలు నలుగురిని కరిచాయి. గాండ్ల గంగలక్ష్మి, ఎర్ర ఆనంద్, మోహన్, హాజీలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితులు నవీపేట, నిజామాబాద్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.